పార్కు స్థలాన్ని పరిరక్షించాలి

నిజాంపేట్: పార్కు స్థలాన్ని కలుపుకుని నిర్మాణాలు చేపడుతున్న కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బాచుపల్లి రేణుక ఎల్లమ్మకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం బాచుపల్లి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్వే నెంబరు 486, 485పిలలో విస్తరించి ఉన్న రేణుకాఎల్లమ్మ కాలనీలో భవిష్యత్ అవసరాలకు, పార్కు అభివృద్ధికి 800 గజాల స్థలాన్ని వదిలి పెట్టామన్నారు. అయితే సర్వే నం.345, 403, 406లలో రైజ్ డెవలర్స్ పేరుతో నిర్మాణాలు చేపడుతున్న అరవిందొరెడ్డి అనే వ్యక్తి పార్కు స్థలాన్ని కబళించేందుకు యత్నిస్తున్నాడని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు ఈ విషయమై చర్యలు తీసుకుని పార్కు స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. ఉపాధ్యక్షుడు నారాయణరావు, ప్రధాన కార్యదర్శి నరోత్తమ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి రాకేష్, కోశాధికారి రామారావు తదితరులు ఉన్నారు.

నిజాంపేట్ కార్పొరేషన్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తాం

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌కు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. మంగళవారం నిజాంపేట్ కార్పొరేషన్ సాధారణ సర్వసభ్య సమావేశంలో కమిషనర్ రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా 2024–25 అంచనా బడ్జెట్, 2023–24 వార్షిక సవరణ బడ్జెట్‌కు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా మేయర్ నీలారెడ్డి మాట్లాడుతూ.. నిజాంపేట్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు బడ్జెట్ రూపకల్పన చేశామన్నారు. రూ.111.50 కోట్ల అంచనాతో రూపొందించిన 2024–2025 బడ్జెట్‌లో ఉద్యోగుల జీతాలు, పొరుగుసేవల ఉద్యోగుల జీతాలు, పారిశుద్ధ్య నిర్వహణ, కరెంట్ బిల్లులు, రుణ వాయిదాల చెల్లింపులకు వెచ్చించనున్నారు.

◆ ఈ బడ్జెట్‌లో10 శాతం నిధులను (పురపాలక సంఘం సొంత ఆదాయ వనరులు, పట్టణ ప్రగతి నిధులు, 15వ (యునైటెడ్) నిధులు ఆర్థిక సంఘం నిధుల నుంచి హరితహారం గ్రీన్ బడ్జెట్ పనులకు 10 కోట్ల 71లక్షల, 25 వేల రూపాయల నిధులను కేటాయించారు. బడ్జెట్‌లో 1/3వ కొత్తగా విలీనమైన ప్రాంతాలలో క్లిష్టమైన మౌలిక సదుపాయాల అవసరాలు, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలకు వెచ్చించనున్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, కో.ఆప్షన్ సభ్యులు, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, పారిశుద్ధ్యం, జలమండలి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఇస్రో భారతదేశాన్ని అగ్రగామిగా నిలిపింది'



త్రివేణి స్కూల్‌లో జరిగిన సైన్స్‌ఫెస్ట్–24లో నమూనాలను పరిశీలిస్తున్న గాంధారి ప్రభాకర్

కుత్బుల్లాపూర్: చంద్రయాన్– 3, ఆదిత్య ఎల్–1 విజయంతో భారతదేశం గగన్‌యాన్ దిశగా దూసుకుపోతోందని టీఎస్ఎఫ్ఏ వైస్ ప్రెసిడెంట్ గాంధారి ప్రభాకర్ అన్నారు. చింతల్ త్రివేణి స్కూల్‌లో మంగళవారం సైన్స్‌ఫెస్ట్–24ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శాస్త్ర, సాంకేతికలకు సంబంధించి 350 నమూనాలను ప్రదర్శించి అబ్బుర పరిచారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గాంధారి ప్రభాకర్ మాట్లాడుతూ.. చంద్రయాన్–3 ఆదిత్య ఎల్–1 ప్రయోగాలతో ఇస్రో సరికొత్త రికార్డులు సృష్టించి ప్రపంచ దేశాలలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలిపిందన్నారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులు సైన్స్ సంబంధిత అంశాలపై దృష్టిని కేంద్రీకరించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్, త్రివేణి సైన్స్ అధికారి సుబ్బారావు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన సైన్స్ కాంపిటీషన్‌లో తమ విద్యార్థులు రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిల్లో బహుమతులు పొందడం గర్వంగా ఉందన్నారు. ఈ సైన్స్ ఫెస్ట్ 24కు న్యాయనిర్ణేతలుగా సరిత, రాములు వ్యవహరించారు. అనంతరం ఉత్తమ నమూనాలు ప్రదర్శించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నళిని, సీఆర్‌ఓ వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుండిగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి అన్నారు. మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో సోమవారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 2024–25ఆర్థిక సంవత్సరానికి రూ.54.45 కోట్లు అంచనా ఆదాయం ఉండగా వాటిలో రూ.52.22 కోట్లు వ్యయంగా రూ.2.23 కోట్లు మిగులు బడ్జెట్‌గా సమావేశంలో ప్రవేశపెట్టారు. అదే విధంగా 2023–24 ఆర్థిక సంవత్సర సవరణ బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదిస్తు తీర్మానించింది.

◆ అనంతరం కృష్ణవేణి మాట్లాడుతూ.. సహచర కౌన్సిలర్ల సహకారంతో అన్ని వార్డుల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌లు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. పెండింగ్ పనులను సైతం త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. బడ్జెట్‌కు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినందుకు కౌన్సిల్ సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పద్మారావు, కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ, మండల వైద్యాధికారిణి నిర్మల, ఏఈ ప్రవీణ్, రెవెన్యూ అధికారి సునంత, మేనేజర్ నరసింహులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు తొలి ప్రాధాన్యం

నిజాంపేట్: బాచుపల్లిలోని వికాస్ ది కాన్సెప్ట్ స్కూల్‌లో మంగళవారం కాడ్ కేర్ యూఎస్ అండ్ గెట్ సెట్ హెల్దీ ఫౌండేషన్ సౌజన్యంతో విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పాఠశాల చైర్‌పర్సన్ స్వరాజ్య లక్ష్మి, డైరెక్టర్ రాహుల్, సీఈవో సంజీవ్‌లు మాట్లాడారు. తమ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. అందులో భాగంగా పోషక ఆహార విలువలు, టీకాలు, ఆరోగ్యపరమైన ఆహార అలవాట్లు, పరిశుభ్రత, వ్యాధుల నిర్మూలన తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నామని తెలిపారు. డాక్టర్లు ఉషారాణి, సబినే కపాసి, డబ్ల్యూహెచ్‌ఓ వైద్యుడు చిరంజీవి దీక్షిత్ తదితరులు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

అంగరంగవైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు


కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి 10 గంటలకు జరిగిన రథోత్సవంలో అశేష భక్త జనం పాల్గొన్నారు. పురవీధుల్లో స్వామి అమ్మవార్లను రథంపై ఊరేగించగా భక్తులు హారతులు పట్టారు. మంగళవారం ఉదయం 10గంటలకు మహా పూర్ణాహుతి, చక్రతీర్థం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. యువనేస్తం వ్యవస్థాపకుడు, కాంగ్రెస్ నాయకుడు కేపీ విశాల్‌గౌడ్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రకృతి పరవశం



సర్వేపల్లి రాధాకృష్ణ పార్కులో వాకర్స్‌ను ఆకట్టుకుంటున్న దృశ్యం

ప్రకృతిలోని చెట్లు కాలంతో పాటు తమ రూపాన్ని సైతం మార్చుకుంటూ మానవాళిని పరవశింపజేస్తాయి. అందులో కొన్ని చెట్లు తమ ఆకులను వదిలి పూలతో కనువిందు చేస్తాయి. మరికొన్ని చెట్లు వేసవి కాలం ప్రారంభం అవుతుండగానే పూలను పూసి ప్రకృతికే వన్నె తెస్తాయి. కొన్ని చెట్లు తమ పూలతో పలు ప్రయోజనాలను సైతం కల్పిస్తూ కనివిందు చేస్తాయి. నిజాంపేట్ కార్పొరేషన్‌లోని ప్రగతినగర్, బాచుపల్లి ప్రాంతాల్లో చెట్లకు పూసిన పూలను చూసి ప్రజలు అనుభూతి పొందుతున్నారు.
– నిజాంపేట్



ప్రగతినగర్‌లో ఓ రోడ్డుపై ఉన్న చెట్లకు పూసిన పూలు

మోదుకు చెట్టుకు పూసిన పూలు

అద్దెలు రాక.. జీతాలు అందక.!

- అవస్థలు పడుతున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు
- అద్దె భవనాల్లోనే జిల్లాలోని 793 కేంద్రాల్లో 443 కేంద్రాలు
- 117 కేంద్రాల్లో నీటి కొరత.. మరుగుదొడ్లు లేనివి 118
- అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు.. గర్భిణులకు తప్పని పాట్లు

సాక్షి, మేడ్చల్ జిల్లా: అంగన్‌వాడీ కేంద్రాల్లో పసిపిల్లలు, గర్భిణులు, బాలింతలను పలు సమస్యలు కలవర పెడుతున్నాయి. పలు కేంద్రాల్లో ప్రధానమైన తాగునీరు, మరుగుదొడ్లు, కరెంటు సమస్య వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. అద్దె భవనాలకు అద్దె డబ్బులు చెల్లించకపోవడం ఒకవంతు అయితే.. సొంత భవనాలున్న కేంద్రాలకు కూడా సరైన వసతులు కల్పించలేని పరిస్థితి నెలకొంది. అలాగే, అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్న టీచర్లు, ఆయాల(హెల్పర్లు)కు కూడా నెలనెలా జీతాలు అందించలేకపోతున్నారు. ఇవన్నీ సంబంధిత శాఖ అధికారులకు తెలిసినప్పటికీ.. ఏ మాత్రం చొరవ చూపడం లేదని తెలుస్తోంది.

793 కేంద్రాల్లో 1.07 లక్షల మంది

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఇందులో ఆరు నెలల నుంచి ఆరేండ్ల పిల్లలు 90.361 మంది, గర్భిణులు, బాలింతలు 17,123 మంది ఉండగా, మొత్తంగా 1,07,484 మంది ఉన్నారు. ఇందులో కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 311 కేంద్రాలు ఉండగా, 47.028 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు, మేడ్చల్‌లో 211 అంగన్‌వాడీ కేంద్రాల్లో 39,463 మంది, అల్వాల్ పరిధిలో 271 అంగన్‌వాడీ కేంద్రాల్లో 20,993 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

సొంత భవనాలు లేనివి 443

జిల్లాలోని 793 అంగన్‌వాడీ కేంద్రాల్లో 212 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. ఇవి కాకుండా దాతలు ఉచితంగా ఇచ్చిన 138 భవనాల్లో కూడా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మిగిలిన 443 అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 311 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అత్యధికంగా 277 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అల్వాల్‌లో 271 కేంద్రాల్లో 143 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మేడ్చల్‌లో 211 అంగన్‌వాడీ కేంద్రాలకు గానూ 23 మాత్రమే అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

117 కేంద్రాల్లో నీటి కటకట

జిల్లాలోని 793 అంగన్‌వాడీ కేంద్రాల్లో 117 కేంద్రాల్లో తాగునీరు తదితర సౌకర్యాలు లేవు. ఇందులో మేడ్చల్ ప్రాజెక్టు పరిధిలో 211 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఇందులో అత్యధికంగా 77 కేంద్రాల్లో తాగునీరు లేదు. అల్వాల్ ప్రాజెక్టు పరిధిలో 40 కేంద్రాల్లో నీటి సమస్య ఉంది.

మరుగుదొడ్లు అంతే..

జిల్లాలోని మొత్తం 793 అంగన్‌వాడీ కేంద్రాలకు గానూ 118 అంగన్‌వాడీ కేంద్రాలోలే మరుగుదొడ్లు లేవు. ఇందులో మేడ్చల్ ప్రాజెక్టు పరిధిలో 78, అల్వాల్ ప్రాజెక్టు పరిధిలో 51, కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 40 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు లేవు. అలాగే అద్దె భవనాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఇచ్చే అద్దె చాలా తక్కువ కావడంతో టాయ్‌లెట్ కట్టించి ఇచ్చే పరిస్థితి లేదు.

6నెలల అద్దెలు.. 3నెలల జీతాలు రాక..

మేడ్చల్ జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 443 కేంద్రాలు అద్దె భవనాల్లో మనుగడ సాగిస్తున్నాయి. ఈ అద్దె భవనాలకు ఆరు నెలలుగా అద్దె డబ్బులు చెల్లించకపోవడంతో టీచర్లు, ఆయాలు ఇంటి యాజమానుల నుంచి తీవ్ర వేధింపులు ఎదుర్కొంటున్నారు. అలాగే, 793 అంగన్‌వాడీ టీచర్లకు గానూ 751 మంది మాత్రమే పని చేస్తున్నారు. మిగతా 42 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే, 779 ఆయా పోస్టులకు గానూ 741 మంది మాత్రమే పని చేస్తున్నారు. మిగతా 38 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంగన్‌వాడీల్లో ఖాళీలు సంగతి అటుంచితే.. ప్రస్తుతం పని చేస్తున్న 751 మంది టీచర్లు, 741 మంది ఆయాల(హెల్పర్లు)కు మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎస్ఆర్ నాయక్‌నగర్ ఎన్నికల్లో టీటీకే విజయం

జీడిమెట్ల: ఐడీఏ జీడిమెట్ల ఎస్ఆర్ నాయక్‌నగర్‌లో ఆదివారం జరిగిన అసోషియేషన్ ఎన్నికల్లో టీటీకే ప్యానల్ భారీ విజయాన్ని సాధించింది. రెండేళ్లకు ఒకసారి కాలనీ అసోషియేషన్ ఎన్నికలు నిర్వహిస్తారు. పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో టీటీకే శ్రీనివాసరావు మహేందర్‌రెడ్డి, అజయ్ విజయ భాస్కర్‌రెడ్డి ప్యానల్‌ల మధ్య ఆదివారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరిగింది. మొత్తం 389 ఓట్లు పోలవగా అధ్యక్షుడిగా పోటీ చేసిన శ్రీనివాసరావుకు 284ఓట్లు రాగా అజయ్‌కు 101ఓట్లు వచ్చాయి. జనరల్ సెక్రటరీ మహేందర్‌రెడ్డికి 255ఓట్లు రాగా భాస్కర్‌రెడ్డికి 128ఓట్లు వచ్చాయి. మొత్తం టీటీకే ప్యానల్‌లో ఉన్న 11మంది సభ్యులు భారీ మెజార్టీతో గెలుపొందారు. గెలుపొందిన సభ్యులకు సోమవారం రాత్రి ప్రతులను అందజేశారు. ఎన్నికల్లో కాలనీ అసోషియేషన్ అధ్యక్షునిగా గోగినేని శ్రీనివాసరావు(టీటీకే), జనరల్ సెక్రటరీగా చిలుకూరి మహేందర్‌రెడ్డి రెండోసారి ఎన్నికయ్యారు. ట్రెజరర్‌గా మధుసూదనరావు, చీఫ్ వైస్‌ప్రెసిడెంట్‌గా వి.మల్లికార్జునరావు, వైస్ ప్రెసిడెంట్లుగా బి.సురేందర్ రెడ్డి, జి.హరిబాబు, కార్యనిర్వాహణ కార్యదర్శిగా బి.పూర్ణచంద్ర గుప్తా, జాయింట్ సెక్రటరీలుగా డీవీవీజీఎస్ వర్మ, జీఎస్ఆర్ శాస్త్రి, డి.రాఘవేంద్రరావు, ఎన్.భాగ్యరావులు ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన కార్యకర్గ సభ్యులు మాట్లాడుతూ.. కాలనీకి అత్యుత్తమ సేవలు అందిస్తామని తెలిపారు.



ఎస్ఆర్ నాయక్‌నగర్ అసోషియేషన్ సభ్యులు

సందడిగా ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న రాయల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

రంగారెడ్డినగర్: చింతల్ రాయల్ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే మంగళవారం గాంధీనగర్‌లోని వైఎంఎస్ ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన క్యాట్ వాక్, ఫ్యాషన్ షో తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల విడుదలైన డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో 9.76/10 జీపీఏ సాధించిన విద్యార్థులు షబాతబుస్సం, ప్రియాంక, 9.6 జీపీఏ సాధించిన అప్షా లను సన్మానించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఎటువంటి ట్యూషన్ ఫీజు లేకుండా విద్యను అందిస్తామని కళాశాల యాజమాన్యం ప్రకటించింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మేనకా పాటిల్, డైరెక్టర్లు, సీహెచ్. గోవిందరెడ్డి, ఎస్.వెంకట్‌రెడ్డి, జి.రమేష్ బాబు, కె. రామకృష్ణ, నల్ల జైశంకర్‌గౌడ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

గ్రామదేవతలను పూజించడం మన సంప్రదాయం



రేణుకాఎల్లమ్మ ఆలయం వార్షికోత్సవంలో ఎమ్మెల్యే వివేకానంద, కార్పొరేటర్ శేషగిరి

కుత్బుల్లాపూర్: గ్రామదేవతలను పూజించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయంలో భాగమని ఎమ్మెల్యే వివేకానంద అన్నారు. గాజులరామారం డివిజన్ బాలయ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రేణుకాఎల్లమ్మ దేవాలయం 20వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్ రావుల శేషగిరి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ మహిళలను గ్రామదేవతలు, శక్తి స్వరూపాలుగా పూజించడం భారతదేశ సంస్కృతిలో ఒక భాగమని, అమ్మవార్లను పూజించడం ద్వారా ప్రజలకు ఆపదలు తొలగి అష్టైశ్వర్యాలు, సుఖ సంతోషాలు కలుగతాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ల అధ్యక్షులు విజయరాంరెడ్డి, పుప్పాల భాస్కర్, జగద్గిరిగుట్ట శ్రీవేంకటేశ్వర దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ వేణు యాదవ్, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్‌యాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్, రషీద్ బేగ్, ఆలయ కమిటీ సభ్యులు గంగయ్య, శ్యామ్‌సుందర్ తదితరులు ఉన్నారు.

నేడు భూమిపూజ

కుత్బుల్లాపూర్: చింతల్ న్యూ వివేకానంద్‌నగర్‌లోని బుధవారం విజయగణపతి ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించనున్నారు. ఉదయం 10.08గంటలకు జరిగే భూమిపూజలో ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్, శ్రీశైలంగౌడ్, డీసీసీ మాజీ అధ్యక్షుడు ప్రతాప్ పాల్గొంటారని అన్నారు.

ఎంఎల్ఆర్ఐటీ అధ్యాపకురాలికి అరుదైన గౌరవం



లలితా కామేశ్వరిని సత్కరిస్తున్న మర్రి లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్: ఎంఎల్ఆర్ ఐటీ కళాశాల అధ్యాపకురాలికి అరుదైన గౌరవం దక్కింది. దుండిగల్ లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టర్ వై.లలితా కామేశ్వరి(అసిస్టెంట్ ప్రొఫెసర్) గా విధులు నిర్వహిస్తుంది. కాగా ఇటీవల ఆమెకు పొట్టి శ్రీరాములు యునివర్సిటీ నుంచి సైఫా బుక్ ఆఫ్ రికార్డ్స్ (ఒక యూనిట్ ఆఫ్ హోలిస్టిక్ మెడిసిన్ రీసెర్చ్ ఫౌండేషన్) నుంచి నారీ సమ్మాన్ అవార్డు–2024 ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దుండిగల్‌లోని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కామేశ్వరీని పలువురు సత్కరించారు. కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, డైరెక్టర్ మర్రి శ్రేయరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ రాధిక దేవి, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం నూతన కమిటీ



కుత్బుల్లాపూర్ మండల ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం సభ్యులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ మండల ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడిగా చింతల మహేష్‌కుమార్ ఎన్నికయ్యారు. మంగళవారం కుత్బుల్లాపూర్‌లోని సెయింట్ మోసెస్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వీర్ల రవికుమార్, కోశాధికారిగా చిన్నంగారి గోవర్ధన్ రెడ్డిలు నియమితులయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మహేష్ కుమార్ మాట్లాడుతూ... ప్రైవేటు పాఠశాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు అందరిని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తామన్నారు. అనంతరం ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి గోవర్ధన్‌లు మాట్లాడుతూ.. సంఘాన్ని బలోపేతం చేసి రాష్ట్రంలోనే అత్యున్నత స్థాయిలో నిలబెడతామన్నారు. పెద్దల సలహాలను తీసుకొని సంఘానికి వన్నె తెచ్చే విధంగా నిస్వార్థంగా పనిచేస్తానన్నారు. సంఘం పూర్వ అధ్యక్షులు రావుల వరప్రసాద్ నూతన కమిటీ సభ్యులను అభినందిస్తూ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కకు పెట్టి, సంఘం అభివృద్ధికి పాటుపడాలన్నారు.

ఘనంగా ఓంశాంతి సంస్థ వార్షికోత్సవం



ఓం శాంతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ సత్యనారాయణ, జీడిమెట్ల సీఐ శ్రీనివాస్‌రావు

సుభాష్‌నగర్: సూరారం డివిజన్ హెచ్ఎంటీ సొసైటీలో మంగళవారం ఓంశాంతి సంస్థ 88వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఓం శాంతి జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల సీఐ శ్రీనివాసరావు, ఓం శాంతి సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గాజులరామారం డివిజన్ కాంగ్రెస్ నూతన కమిటీ

కుత్బుల్లాపూర్: గాజులరామారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని నియమించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి సూచన మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి కమిటీని నియమించారు. డివిజన్ అధ్యక్షుడిగా మహ్మద్ లాయక్, ఉపాధ్యక్షులుగా రహీం ఖాన్, మోయిన్, మున్నా, అంజద్, రెహానా బేగం, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా షేక్ కలీం, జి.కృష్ణారెడ్డి, బి.అనిల్ రెడ్డి, ఎండీ. అమీర్ అలీ, జనరల్ సెక్రటరీలుగా షేక్ అహ్మద్, డి.శ్రీనివాస రావు, జి.శ్రీలత, జాయింట్ సెక్రటరీలుగా అహ్మద్, కె. వెంకటేష్, వంశీ, ఆసిఫ్, అజర్, సెక్రటరీలుగా ఆసిఫ్ మౌలానా, జాఫర్, వహీద్, లక్ష్మి, ట్రెజరర్‌గా విజయ్‌రెడ్డి, సభ్యులుగా గురుప్రసాద్, శ్యామ్, సంగ్రామ్, బేబీ, భరత్, మహమ్మద్ ఎంపికయ్యారు. నూతన కమిటీ సభ్యులు హన్మంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు.



కొలన్ హన్మంత్‌రెడ్డిని కలిసిన డివిజన్ కాంగ్రెస్ నూతన కమిటీ సభ్యులు

అపర్ణ ఫామ్ గ్రూప్ అభివృద్ధికి కృషి చేస్తా

అధ్యక్షురాలు ఎడమ సంగీత



అపర్ణపామ్ నూతన కమిటీ సభ్యులతో అధ్యక్షురాలు సంగీతరెడ్డి

కుత్బుల్లాపూర్: అపర్ణ ఫామ్ గ్రూప్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని నూతన అధ్యక్షురాలు ఎడమ సంగీత భాస్కర్‌రెడ్డి అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉండే ఈ కాలనీ ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. శివారు ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో తాజాగా ఇక్కడ నిర్మాణాల జోరు పెరుగుతూ వస్తోంది. తాజాగా ఈ కాలనీలో ఎన్నికలు నిర్వహించగా స్థానిక సంస్థల ఎన్నికలను తలపించేలా జరిగాయి. కోలాహలంగా జరిగిన ఎన్నికల్లో సంగీతరెడ్డి ప్యానెల్ ఘనవిజయం సాధించింది.

ఈ సందర్భంగా సంగీతరెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

◆ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తూ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే వివేకానంద, మున్సిపల్ చైర్మన్ శ్రీశైలం యాదవ్ సహకారంతో పలు పనులు చేయడం జరిగిందని, ముఖ్యంగా వర్షాకాల సమయంలో వరద నీరు అధికంగా కాలనీ ప్రధాన గేటు ముందు నుండి వెళ్తున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. త్వరలోనే అక్కడ శాశ్వత పరిష్కారం చూపుతామని, కాలనీ అసోసియేషన్‌గా ఏర్పడ్డ తమ సభ్యులంతా ఎప్పుడు అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు. ప్రధాన కార్యదర్శి గోపాలరావు, కోశాధికారి జగదీశ్వర్ రావు, ఉపాధ్యక్షుడు బాలరాజు, సంయుక్త కార్యదర్శి శంకర్ తదితరులు ఉన్నారు.

రోడ్డు మధ్యలో మ్యాన్‌హోల్

మూసాపేట: కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సమీపంలో సర్వీస్ రోడ్డుపై మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు మధ్యలో ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మ్యాన్‌హోల్ కనిపించడానికి చుట్టు రాళ్లు ఏర్పాటు చేశారు. కానీ రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని శ్రీకట్టమైసమ్మ ఆలయంలో మంగళవారం కుంకుమార్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉడ్స్ కాలనీకి చెందిన సీఎం కిరాణా దుకాణం యజమాని శ్రీరామ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వివేక్‌రెడ్డి ఆలయం వద్ద భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.